

శిథిలమైన వట్టివాగు ప్రాజెక్టు కాలువలు

సాగు పండుగయ్యేదెన్నడు?

- పెండింగ్‌లోనే ప్రాజెక్టులు
- ముందుకు కదలని పనులు
- జిల్లాలో ఏళ్లుగా సాగునీటి అవస్థలు

ఆసిఫాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టుల నిండా నీరున్నా అవి పంట పొలాలకు అందడం లేదు. మొదటినుంచి జిల్లా రైతాంగానికి వర్షాధారమే దిక్కవుతోంది. ఏళ్లుగా ప్రధాన ప్రాజెక్టులన్నీ పెండింగ్‌లో ఉండడంతో సాగులో పెద్దగా మార్పులేదు. సరైన సాగునీటి వసతిలేక వేలాది ఎకరాల భూమి నిరుపయోగంగా ఉంటోంది. గత్యంతరం లేక ఆరుతడి పంటలతో సరిపెట్టాల్సి వస్తోంది. వానొస్తేనే పంట లేకుంటే లేదు అన్న చందంగా ఉంది. అన్నదాతలు పూర్తిగా వర్షాధార పంటలపై ఆధారపడుతూ కాలం వెళ్లదీస్తున్నారు. ప్రాజెక్టు పూర్తయి సక్రమంగా నీరందిస్తే తప్ప సాగు పండుగలా మారే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు ఉన్నప్పటికీ అవి పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రధానంగా కుమరం భీం, జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు నిర్మాణపనులు పూర్తి కాలేదు. అదేవిధంగా వట్టివాగు ప్రాజెక్టు కాలువలు మరమ్మతులకు నోచుకోవడం లేదు.

● దయనీయ స్థితిలో వట్టివాగు..

ఆసిఫాబాద్ మండలం వట్టివాగు నీటిని చుట్టుపక్కల పొలాలకు అందించాలనే ఉద్దేశంతో 1998లో 24,500ఎకరాల ఆయకట్టు లక్ష్యంగా ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. కుడికాలువ ద్వారా 21,800 ఎకరాలు, ఎడమ కాలువద్వారా 2,700ఎకరాల ఆయకట్టు లక్ష్యంగా నిర్ధేశించారు. కానీ నిర్మించిన కాలు వలు ఇప్పటికే మొత్తం దెబ్బతిన్నాయి. లైనింగ్ కోల్పోయి చెట్లు ఏపుగా పెరిగి అధ్వానంగా మారాయి. చాలాచోట్ల కాలువలు నామరూపాలు లేకుండా పోయాయి. దీంతో ఆసిఫాబాద్, రెబ్బెన మండలాల పరిధిలోని ఆయకట్టు రైతులకు సాగునీరు అందించే స్థితిలోలేదు. అధికారులు ఆధునీకరణ పనుల కోసం ప్రతిపాదనలను పంపినప్పటికీ వాటికి నిధులు విడుదల కాలేదు.

● జగన్నాథ్‘పూర్’..

కాగజ్‌నగర్ మండలంలోని పెద్దవాగుపై నిర్మించిన జగన్నాథ్‌పూర్‌ప్రాజెక్టు పనులు ఇంకా కొనసాగు తూనే ఉన్నాయి. కాగజ్‌నగర్, దహెగాం మండలాల పరిధిలో 15వేల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో ప్రాజెక్టు నిర్మాణపనులను చేపట్టినప్పటికీ నత్తనడకన కొనసాగుతున్నాయి. భూసేకరణ, తదితర సమస్యలతో పనుల్లో తీవ్రజాప్యం జరుగుతోంది. దీంతో ప్రాజెక్టు నిర్మాణం పనుల్లో జాప్యంతో ఆయకట్టు దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు నిర్మిస్తే తమ భూములు పంట పొలాలుగా మారుతాయని ఆశించిన రైతులకు నిరాశే ఎదురవుతోంది.

● పూర్తికాని కుమరం భీం ప్రాజెక్టు..

జిల్లాలో సాగునీటికి గుండెకాయవంటి కుమరంభీం ప్రాజెక్టు ఏళ్లుగా రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరందించడం లేదు. పది టీఎంసీల సామర్థ్యంతో సుమారు రూ.600కోట్లకు పైగా అంచనాలతో నిర్మితమైన ఈప్రాజెక్టు లక్ష్యంలో సగం కూడా నీరందించడం లేదు. కుడి ప్రధానకాలువ ద్వారా ఆసిఫాబాద్ మండల పరిధిలో ఆరువేల ఎకరాలు, ప్రధాన ఎడమకాలువ ద్వారా ఆసిఫాబాద్‌తో పాటు కాగజ్‌నగర్, సిర్పూర్(టి) మండలాల్లోని 45,500ఎకరాలకు సాగునీటిని అందించాలని ప్రాజెక్టును రూపొందించారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా కాలువల పనులు పూర్తి కాలేదు.



కుమరం భీం ప్రాజెక్టు

సదస్సుకు పూర్తి ఏర్పాట్లు చేయాలి

● రాష్ట్ర వెనకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ నిరంజన్‌గౌడ్

ఆసిఫాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడిజిల్లాకేంద్రాల్లో అన్ని కులాల ప్రతినిధులు, అధికారులతో నిర్వహించే సదస్సులకు పూర్తిఏర్పాట్లు చేయాలని రాష్ట్రవెనకబడిన తరగతుల కమిషన్‌చైర్మన్ నిరంజన్‌గౌడ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి వెనుకబడిన తరగతుల కమిషన్ కార్యాలయం నుంచి కమిటీసభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మీరంగు, కార్యదర్శి బాలమాయాదేవితో కలిసి జూమ్ మీటింగ్‌ద్వారా అన్నిజిల్లాల కలెక్టర్‌లు, అదనపుకలెక్టర్‌లు, వెనకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా వెనకబడిన తరగతుల కమిషన్‌చైర్మన్ మాట్లాడుతూ ఉమ్మడిజిల్లా కేంద్రాల్లో సమగ్ర కులసర్వేపై సదస్సులను నిర్వహిస్తామన్నారు. ఈసదస్సుకు జిల్లాలోని అన్నికులాల ప్రతినిధులు, స్వచ్ఛందసంస్థల సభ్యులను ఆహ్వానించాలని అన్నారు. సదస్సును విజయవంతంగా నిర్వహించేందుకు పూర్తి ఏర్పాట్లుచేయాలని తెలిపారు. జిల్లాకలెక్టరేట్ నుంచి అదనపుకలెక్టర్ దీపక్‌తివారి మాట్లాడుతూ ఉమ్మడిజిల్లాకేంద్రమైన ఆదిలాబాద్‌లో ఈనెల28న వెనకబడిన తరగతుల కమీషన్ ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సుకు జల్లాలోని అన్ని కులాల ప్రతినిధులు, స్వచ్ఛందసంస్థల సభ్యులు, శాసనమండలి సభ్యులు, ఎమ్మెల్యేలు, స్థానికప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. సదస్సు విజయవంతంచేసే దిశగాచర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అదనపుకలెక్టర్ దాసరివేణు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఆర్డీవో లోకేశ్వరరావు, జడ్పీసీఈవో లక్ష్మీనారాయణ, డీపీవో భిక్షపతిగౌడ్, జిల్లా సంక్షేమాధికారి సజీవన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో గస్తీ పెంచిన పోలీసులు



యువకులను ప్రశ్నిస్తున్న పోలీసులు

కాగజ్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగవారం రాత్రి నుంచి ఎస్సై దీకొండ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు గస్తీని పెంచారు. రాత్రి వేళల్లో బయట తిరుగుతున్న యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రోడ్లపై ఎవరూ తిరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. వారంరోజులుగా పట్టణంలో లారీఅసోసియేషన్, ఎస్పీఎం యాజమాన్యం మధ్య వివాదం జరుగుతుండడంతో ఎలాంటి అల్లర్లు జరుగకుండా పోలీసులు ప్రశాంతవాతావరణం కోసం గస్తీ ప్రారంభించారు.

ఓవర్ లోడ్ లారీ రాకపై నిరసన



నిరసన తెలుపుతున్న కిషోర్‌బాబు

కాగజ్‌నగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఎస్పీఎం మిల్లుకు వస్తున్న ఓవర్‌లోడ్ కర్ర లారీలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని, వీటిపై వెంటనే తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ బుధవారం లారీ అసోసియేషన్ సభ్యులు చెక్‌పోస్టు వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్‌బాబు మాట్లాడుతూ మిల్లుకు వస్తున్న కర్ర లారీలు నిబంధనలకు విరుద్ధగా ఓవర్‌లోడ్‌తో వస్తున్నాయని తెలిపారు. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నిరసన కార్యక్రమంలో లారీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ప్రభాకర్

పెంచికలపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్ అన్నారు. బుధవారం మండలంలోని లోడ్పల్లి, కొండపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా లోడ్పల్లిలోని ట్రైబల్‌వెల్ఫేర్ పాఠశాలను సందర్శించి పిల్లల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. గ్రామాల్లో శానిటేషన్, తాగు నీటి సరఫరాను పరిశీలించారు. కొండపల్లిలో మరుగుదొడ్లు నిర్మించాలని, తాగు నీటి కోసం ఏర్పాటు చేసిన మోటారు చెడిపోయిందని, మరమ్మతులు చేసి వాడకంలోకి తీసుకురావాలని, గొల్లవాడకు వెళ్లేమార్గంలో ఉన్న వాగుపై వంతెననిర్మించాలని గ్రామస్థులు కోరారు. గిరివికాసం కార్యక్రమంలో యూనిట్లు మంజూరయినా అటవీఅనుమతులు ఇవ్వడం లేదన్నారు. ఆయనవెంట ఎంపీడీవో ఆల్బర్ట్, ఎంఈవో రమేష్‌బాబు,కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

భూదానం చేసిన యజమానికి సన్మానం

వాంకిడి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సడక్‌గూడలో మల్టీపర్పస్‌సెంటర్ భవనానికి 5గుంటలభూమిని దానంచేసిన పిప్పర్‌గొంది గ్రామానికిచెందిన రాథోడ్‌గులాబ్‌ను బుధవారం గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. పీవీటీజీ కోలాం గిరిజనులకోసం రూ.60లక్షలతో మల్టీపర్పస్ సెంటర్ భవననిర్మాణానికి నిధులు మంజూరుకాగా రాథోడ్‌గులాబ్ 5గుంటల భూమిని దానంచేశారు. కార్యక్రమంలో గుంగయ్య అన్నిగా, భీము, భగవంతరావు, మారు, భీము, ప్రభు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జైనూర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమపథకాలను సద్వినియోగం చేసుకోవాలని నాబార్డ్ ఎఫ్ఎల్‌సీ కన్సల్టెంట్ రాంరెడ్డికోరారు. మండలంలోని పవర్‌గూడలో బుధవారం రైతులకుబ్యాంకు లావాదేవీలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్రం రైతులకు ప్రధానమంత్రి జీవన్‌సురక్ష, ప్రధానమంత్రి జీవన్ బీమావంటిపథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ గోడంవనిత, మార్కెట్‌కమిటీ మాజీడైరెక్టర్ గోడం లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

విగ్రహ ఆవిష్కరణ

జైనూర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్నాపూర్‌లో ఈనెల26న కుమరంభీంవిగ్రహ ఆవిష్కరణ ఉంటుందని కార్యక్రమానికి వేలాదిగా తరలిరావాలని ఆదివాసీనాయకుడు పెందుర్‌లచ్చు కోరారు. బుధవారం భీంవిగ్రహం ఆవిష్కరణ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ మాజీచైర్మన్ కనక యాదవ్‌రావ్, మేస్రాం అంబాజీ, చాహకటి గణేష్, మేస్రాందౌలత్‌రావ్ పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయాలి

జైనూర్, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): దండారిసంబరాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యపనులను ముమ్మరం చేయాలని ఎంపీడీవో సుధాకర్ రెడ్డికోరారు. ఎంపీడీవోకార్యాలయంలో బుధవారం గ్రామకార్యదర్శులు, ఉపాధిసిబ్బందితో ఎంపీడీవో సమావేశంనిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు రక్షితమంచినీటి సదుపాయం కల్పించాలని అదేవిధంగా విద్యుత్‌దీపాలు అమర్చాలని సూచించారు.

కుమరం భీం వర్ధంతి

బెజ్జూరు/కౌటాల:మండలకేంద్రాల్లో బుధవారంకుమరంభీం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. భీంవిగ్రహానికి పూలమా లలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సకారాం, తిరుపతి, శంకర్, కెశంకర్, కౌటాలలోడీ సీఎంఎస్‌వైస్‌చైర్మన్‌వాంతయ్య, బాపు,రాజు,సిద్దయ్యసత్తయ్య పాల్గొన్నారు.



బెజ్జూరులో భీం విగ్రహానికి పూల మాల వేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్ మున్సిపల్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కాగజ్‌నగర్ మున్సిపల్‌అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని అదనపుకలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో కాగజ్‌నగర్ మున్సిపాలిటీ అమృత్2.0కింద ఎంపికైనందున మున్సిపల్ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై అన్నిశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాగజ్‌నగర్‌మున్సిపాలిటీ అమృత్ 2.0 ఫిదా ఎంపికైనందున మున్సిపాలిటీలో ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమపథకాలు, అభివృద్ధి పనులతోపాటు వచ్చే 20సంవత్సరాల కొరకు చేపట్టే అభివృద్ధి పనులపై ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో జీఏఎస్ డ్రోన్‌ద్వారా మున్సిపాలిటీని చిత్రిస్తామని అన్నారు. పదిసంవత్సరాలలో పట్టణవివరాలు, వచ్చే20 సంవత్సరాల నాటికి ప్రజలకు అవసరమైన వాటిని గుర్తించి ప్రణాళికలను శాఖలవారీగా ఈనెల31లోగా మున్సిపల్ కమిషనర్‌కు అందించాలని తెలిపారు. మున్సిపల్ అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ప్లాట్లను పరిశీలన..

కెరమెరి: మండలంలోని హట్టిగ్రామ సమీపంలో కెరమెరికి చెందిన పలువురు ఎల్‌ఆర్ఎస్ కోసం దర ఖాస్తు చేసుకోగా బుధవారం స్థలాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీతహసీల్దార్ నుంచి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించాలని ఆదేశించారు. అనంతరం కెరమెరి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అక్కడ నిర్మిస్తున్న మరుగుదొడ్లను, మూత్రశాలలను పరిశీలించి పనులు నాణ్యతగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎస్ఏఎస్ సర్వే వివరాలను విద్యార్థుల వారీగా పొందుపరిచి వారాంతపు పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరం ఎస్సీకాలనీలోని ఐసీడీఎస్ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడజరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక వంట గది నిర్మించాలని అంగన్‌వాడీ టీచర్ అదనపు కలెక్టర్‌కు దృష్టికి తీసుకువచ్చారు. ఆయనవెంట ఎంపీడీవో అంజద్‌పాషా, ఎంఈవో ప్రకాష్, డీటీ సంతోష్, ఏఈ నజ్మోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలను పరిశీలించిన ప్రత్యేకాధికారి

చింతలమానేపల్లి, అక్టోబరు 23: మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు పరిశీలించారు. పదవతరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం వంటగది, భోజనాలనుపరి శీలించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాఠశాలకుప్రహరీ, ఆటస్థలంకావాలని ఉపాధ్యాయులు, విద్యార్థులుతెలిపారు. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికితీసుకెళ్తామని తెలిపారు. విద్యార్థులకుకావాల్సిన ఆటవస్తువులు సమకూర్చుతామని తెలిపారు. ఆయనవెంట ఎంపీడీవోప్రసాద్, ఎంపీవో సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి ఆసీఫ్‌అలీ, ఎస్‌వో శ్రీదేవి ఉన్నారు.

ఘనంగా పూలాజీబాబా ధ్యానకేంద్ర వార్షికోత్సవం

వాంకిడి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోయగాం గ్రామంలో బుధవారం శ్రీసంత్ సద్గురు పూలాజీ బాబా ధ్యానకేంద్ర 24వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పూలాజీబాబా తనయుడు కేశవ్‌ఇంగ్లే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రవచనాలను బోధించారు. కార్యక్రమంలో కమిటీసభ్యులు ముకుందరావు, భగవంత్‌రావు, శంకర్, కాశయ్య, బాబురావు, తిరుపతి, సోంజీ, తదితరులు పాల్గొన్నారు.

సదస్సును విజయవంతం చేయండి

ఆసిఫాబాద్ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఈనెల28న రంగారెడ్డి జిల్లా తుర్కయాంజాల్ సాయిబాబా ఆలయ ఆవరణలో డీడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చాలతాబాదు వాసుదేవశర్మ ఆధ్వర్యంలో ఐక్యతాసదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు జిల్లాలోని అర్చకులు పాల్గొని విజయవంతం చేయాలని డీడీఎస్ అర్చకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుసత్యనారాయణ శర్మ, జిల్లా అధ్యక్షుడు ఒజ్జల శిరీష్ శర్మ కోరారు. సదస్సులో అర్చకుల సంక్షేమం, భవిష్యత్ కార్యాచరణ, ఇతర సమస్యల పరిష్కారంపై చర్చిస్తామన్నారు.

ఉపాధ్యాయులకు ఐడీ కేటాయించాలి



వినతి పత్రం అందజేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నూతనంగా నియమి తులైన ఉపాధ్యాయులకు ఎంప్లాయి ఐడీలు ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఖజానా అధికారికి వినతి పత్రం అందజేశారు. కొన్నిమండలాల్లో నూతన ఉపాధ్యాయులకు ఎంప్లాయ్ ఐడీ కొరకు కొంతమంది మధ్యవర్తుల ద్వారా అమౌంట్ సేకరిస్తున్నట్టుగా మాదృష్టికి వచ్చిందని, ఎటువంటి అవినీతి లేకుండా మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు శాంతికుమారి, హేమంత్‌సిండె, రమేష్, హరీష్, బాజీఖాన్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐగా బాధ్యతలు స్వీకరించిన బుద్దె రవీందర్



ఎస్పీకి మొక్కను అందజేస్తున్న సీఐ రవీందర్

ఆసిఫాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ టౌన్ పోలీసుస్టేషన్ నూతనసీఐగా బుద్దె రవీందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ డీవీ శ్రీనివాసరావును మర్యాదపూర్వ కంగా కలిసి మొక్కను అందజేశారు. బుద్దె రవీందర్ గతంలో ఇంటిలిజెన్స్ డిపార్టుమెంట్‌లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటూ బాధితులకు సత్వరన్యాయం చేకూర్చే విదంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు.

జీతాలెప్పుడిస్తారు?

● మూడు నెలల నుంచి అందని జీతాలు ● పండుగ పూట కష్టాలు తీర్చాలని వినతి




మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు(ఫైల్)

కాగజ్‌నగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు మూడు నెలలుగా జీతాలు రాకపోవటంతో మళ్లీ పోరుబాట పడుతున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కారించాలని రెండ్రోజుల క్రితం కూడా సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. మున్సిపాల్టీలో పనిచేస్తున్న 145మంది కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించలేదు. మరోవారం గడిస్తే దీపావళి పండుగ ఉందని, తమకు వెంటనే జీతాలివ్వాలని కార్మికులు డిమాండు చేస్తున్నారు. అధికారులకు ముందు నుంచి తమ గోడు వెళ్లబోసుకుంటున్నా ఇంతవరకు సమస్య పరిష్కరించడం లేదని పేర్కొంటున్నారు. ప్రస్తుతం అప్పులు చేసి కాలం వెళ్ల దీస్తున్నామని పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు అరువు నిత్యాసవర సరుకులు ఇచ్చిన కిరాణా షాపు యజమానులు ఇకపై ఇవ్వమని పేర్కొంటున్నారని వాపోయారు.

కుటుంబ పోషణ కష్టంగా ఉంది..

-శంకరమ్మ, కాంట్రాక్టు కార్మికురాలు



మాకు మూడునెలల నుంచి జీతాలివ్వటం లేదు. ఒక్కనెల జీతం రాకుంటేనే చాలా ఇబ్బందిగా ఉంటుంది. అలాంటిది మూడునెలలుగా జీతాలు లేక కాలం వెల్లదీస్తున్నాం. వెంటనే జీతాలు చెల్లించాలి. వచ్చేది దీపావళి పండుగ. జీతాలు ఇస్తే ఇంట్లో పండుగ జరుపుకుంటాం. లేదంటే పస్తులే.

అరువుకు తెచుకుంటున్నాం..

-పద్మ, కాంట్రాక్టు కార్మికురాలు



మాజీతాలు రాకపోవటంతో నిత్యావసరసరుకులు కూడా అరువుకు తెచ్చుకోవాల్సి వస్తోంది. నెలనెలా జీతాలు వస్తే ఈ సమస్య ఉండదు. పండుగపూట కష్టాలు రాకుండా అధికారులు చూడాలి. చాలా ఇబ్బందుల్లో ఉన్నాం. మూడు నెలల నుంచి జీతాలు లేవు.

క్రైం కార్నర్

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

నస్పూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజునగర్‌కు చెందిన బుద్దె రాజు (40) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టైలర్ పని చేస్తూ జీవనం సాగిస్తున్న రాజు రెండేళ్ల నుంచి గొడవల కారణంగా భార్య దూరంగా ఉంటోంది. మంగళవారం నుంచి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయక పోవడంతో బుధవారం బావమరిది సతీష్ తలుపు సందులోంచి చూడగా ఉరివేసుకుని వేలాడుతూ కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుగుణాకర్ తెలిపారు.

నిందితులను కస్టడీలోకి తీసుకున్న పోలీసులు

చెన్నూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు పట్టణంలోని శనగ కుంట చెరువు మత్తడి ధ్వంసం కేసులో ఇద్దరు నిందితులను కస్టడీలోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే 14 మంది జైలుకు వెళ్లగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తుల సమ్మయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త రామ్‌లాల్ గిల్డాలను మూడు రోజులపాటు న్యాయవాది సమక్షంలో విచారిం చేందుకు కోర్టు అనుమతించిందని పేర్కొన్నారు.

దాడి చేసి గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు

నెన్నెల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రావణ్‌పల్లికి చెందిన బుక్య చందు అత్త, బావమరిదిపై బుధవారం దాడి చేసి గాయపరిచాడు. చందు భార్య సునీతతో తరచు గొడవ పడుతుండటంతో అడిగేందుకు వెళ్లిన అత్త రాజమ్మ, బావమరిది అజ్మీరా రాజేష్, వదిన వసంతలను కర్రతో కొట్టి గాయ పరిచాడు. రాజమ్మ చేయి విరగగా, రాజేష్ తలకు గాయమైంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

వాంకిడి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వాంకిడి నుంచి కెరమెరికి పికప్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పశువులను ఎస్సై ప్రశాంత్ పట్టుక న్నారు. మండలంలోని ఇందాని ఎక్స్‌రోడ్డు పోలీసు చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలు చేపడుతుండగా వాంకిడి నుంచి కెరమెరికి పశువులను తరలి స్తున్న వాహనాన్ని పట్టుకున్నామన్నారు. వాటి రవాణాకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవన్నారు. వాహనదారుడు కెరమెరికి చెందిన షేక్ తాజుద్దీన్‌పై కేసు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేసి పశువులను గోశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కాసిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ నుంచి టాటా ఏస్ వాహనంలో తరలిస్తున్న 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమగూడెం వద్ద టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పట్టుకున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. దేవాపూర్ చెందిన ఫయాజ్‌ఖాన్ రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మంగళవారం రాత్రి పట్టుక న్నట్లు తెలిపారు. బియ్యాన్ని, వాహనాన్ని సీజ్ చేసి, నిందితున్ని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోలీస్‌స్టేషన్లలో ఓపెన్ హౌస్



మాదారం పోలీస్‌స్టేషన్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తాండూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మాదారం పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌజ్ నిర్వహించారు. ఎస్‌ఐ సౌజన్య విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌లో ఉండే రిసెప్షన్ వ్యవస్థ, కేసు డైరీలు, స్టేషన్‌లో ఉపయోగించే ఆయుధాలు, విధులు, షీటీమ్స్ సైబర్ మోసాలకు అవగాహన కల్పించారు.

కాసిపేట(ఆంధ్రజ్యోతి): కాసిపేట పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌజ్ నిర్వహిం చారు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ సోమగూడెంలోని పాఠశాలల విద్యార్థులకు వివరించారు.

రామకృష్ణాపూర్,(ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యం లో ఓపెన్ హౌజ్ నిర్వహించారు. ఆయన ఆయుధాల పని తీరు, తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

కన్నెపల్లి, (ఆంధ్రజ్యోతి): కన్నెపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌజ్ నిర్వహిం చారు. పోలీసుల విధులు, ఆయుధాల ఉపయోగం, రికార్డుల నమోదుపై వివరించారు.

భీమిని,(ఆంధ్రజ్యోతి): పోలీస్ విధులపై ఎస్సై విజయ్ కుమార్ అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల జోలికి పోవద్దని, వాటి వల్ల కలిగే నష్టం గురించి వివరించారు. ఏఎస్సై తిరుపతి, కానిస్టేబుల్లు మల్లేష్, సుధీర్ పాల్గొన్నారు.

డీసీపీని కలిసిన నాయకులు

గర్మిళ్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని డీసీపీ కార్యాల యంలో డీసీపీని బుధవారం ఎస్సీ నాయకులు డాక్టర్ పెరుమాండ్ల రామ కృష్ణ, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ రామగిరి బానేష్‌లు కలిసి వినతి పత్రం అం దించారు. వారు మాట్లాడుతూ ఎస్సీలు అన్యాయానికి గురై పోలీసులను ఆశ్ర యించినప్పుడు వారికి సహాయ సహకారాలు అందించాలన్నారు. నాయకులు రేగుంట సునీల్ మాదిగ, రేగుంట రాయలింగు, రాందేవ్ పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పొలంబాట

దండేపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ క్షేత్రాలకు విద్యుత్ సరఫరా చేసే క్రమంలో ఏమైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకు రావాలని విద్యుత్ శాఖ ఏఈఈ బాపు కోరారు. పొలంబాటలో భాగంగా బుధవారం దండేపల్లిలో వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ సిబ్బందితో కలిసి పర్యటించారు. పొలాల్లో వంగిన విద్యుత్ స్తంభాలను, వేలాడుతున్న తీగలను సరి చేశారు. ఏదైన సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకవస్తే మరమ్మతు చేపడుతామన్నారు. సబ్ ఇంజనీర్ సాయికృష్ణ, లైన్ ఇన్స్‌పెక్టర్‌లు గౌస్, లక్ష్మన్, లైన్‌మన్ నెల్కి మల్లేష్, జూనియర్ లైన్‌మన్ శ్రీకాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లేట్లు, విద్యాసామాగ్రి పంపిణీ

కాసిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కల్వరి మినిస్ట్రీస్ ఫౌండేషన్ చైర్మన్ సిస్టర్ షారోన్ పుట్టిన రోజును పురస్కరించుకుని బుధవారం కేజీబీవీ పాఠశాలలోని విద్యార్థినులకు ప్లేట్లు, గ్లాసులు, ఫ్యాన్‌లు, విద్యా సామగ్రిని అందజేశారు. తహసీల్దార్ భోజన్న, నాయకులు రాంచందర్, సత్తయ్య, మహేష్, రవికుమార్, కేజీబీవీ ప్రిన్సిపాల్ సరిత పాల్గొన్నారు.

50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలి

కాసిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణతో పాటు ఉప కులాలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని బుధవారం అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు అంబేద్కర్ సేన బెల్లంపల్లి నియోజకవర్గ కన్వీనర్ నగురారపు సుమన్ వినతి పత్రం అందించారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణను వేగవంతం చేసి ఉపకులాలకు 50 శాతం రిజర్వేషన్‌లు అన్ని శాఖల్లో కల్పించాలని కోరారు. నాయకులు జ్యోత్స్న , సురేందర్ పాల్గొన్నారు.

రోడ్డు మంజూరు చేయాలి

తాండూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కత్తెర్ల నుంచి బర్లగూడెం వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని బోయపల్లి మాజీ సర్పంచు భీమ సునీత, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌లు బుధవారం హైద్రాబాద్‌లో ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామికి వినతిపత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే రోడ్డు మంజూరుకు కృషి చేస్తానని హామీఇచ్చినట్లు వారు తెలిపారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న మాజీ సర్పంచు

కన్నెపల్లి(ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను జజ్జరవెల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు కలిశారు. కొత్తపల్లి గ్రామంలోని సర్వే నెంబరు 89లోని భూమిని 50 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న వారిని అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని దీనిపై న్యాయం చేయాలని కోరారు. మెరుగు ప్రసాద్, కొట్రంగి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

గుంతలమయంగా కాగజ్‌నగర్ రోడ్లు

● ఏడాదికే లేచిపోయిన తారు ● గల్లీ రోడ్లు మరింత అధ్వానం



పట్టణంలో రోడ్లపై ఏర్పడిన గుంతలు



లారీ చౌక్‌లో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

కాగజ్‌నగర్ టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రధాన రోడ్లన్నీ గుంతలమయంగా మారడంతో పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. గత సంవత్సరం సెప్టెంబరులో నిర్మించిన ప్రధాన రోడ్లు సంవత్సరం గడవక ముందే గుంతలమయంగా తయారయ్యాయి. అలాగే పట్టణంలోని ఆయా కాలనీల్లో పూర్తి స్థాయిలో రోడ్లు లేవు. ఉన్న కొన్నిచోట్ల అధ్వాన్నంగా మారాయి. కాగజ్‌నగర్ మున్సిపల్‌గా మారి అర్ధశతాబ్దం కావస్తున్నా నేటికీ సరైన రహదారులు లేవని ప్రజలు పేర్కొంటున్నారు. పట్టణంలోని 30వార్డుల్లో గల్లీ రోడ్లు చిన్నపాటి వర్షాలకే చిత్తడిగా మారుతున్నాయి. పట్టణంలో సుమారు 53వేల పైగా జనాబా ఉంటుండగా ఏ ఒక్క సౌకర్యం సరిగ్గా లేదిని ప్రజలు పేర్కొంటున్నారు.

బీటీ రోడ్లకు గుంతలు..

గత సంవత్సరం ఎన్నికల ముందు హడావుడిగా ఎన్‌టీఆర్ చౌరస్తా నుంచి రాజీవ్‌గాంధీ చౌరస్తా వరకు, రాజీవ్ చౌక్ నుంచి అంబేద్కర్‌చౌక్ వరకు బీటీ రోడ్డును సుమారు కోటిరూపాయలతో నిర్మించారు. ఎన్నికల్లోగా పూర్తి చేయాలనే ఉద్దేశ్యంతో వర్షాకాలంలోనే పనులు చేపట్టారు. అయితే ఈ రోడ్లపై మూన్నాళ్లకే గుంతలు ఏర్పడ్డాయి. లారీచౌరస్తాతో పాటు, సుభాష్‌రోడ్డు, రాజీవ్‌చౌక్ సమీపంలో బీటీ రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కురిసిన భారీవర్షాలకు గుంతల్లో నీరు చేరింది. దీంతో బీటీ రోడ్లు మరింత చెడిపోయాయి. సదరు కాంట్రాక్టరుతో మరమ్మతులు చేయించలేదు. ఎంతో కాలం మన్నికగా ఉండాల్సిన బీటీ రోడ్డే ఈవిధంగా పాడయిపోతే మిగిలిన రోడ్ల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. వర్షాలు పడుతుంటే గత సంవత్సరం రోడ్డును హడావుడిగా వేయించి చేతులు దులుపుకున్నారు. బీటీ రోడ్లపై అక్కడక్కడా వర్షం నీరు నిలిచి పోయి ఆయాస్థలాల్లో గుంతలు ఏర్పడ్డాయి. హాట్ మిక్సింగ్ ప్రెస్సింగ్ ద్వారా పనులు చేయిస్తున్నామని అప్పుడు చెప్పినప్పటికీ సరైన నిర్వహణ లేకపోవడంతోనే ఈవిధంగా మారిందని నిపుణులు అంటున్నారు. దీంతోపాటు ఆయా రోడ్లపై పారుతున్న మురుగునీరు కూడా రోడ్లు పాడవడానికి కారణంగా పేర్కొంటున్నారు. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలా జరుగుతోందని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గల్లీ రోడ్లయితే మరింత అధ్వాన్నం..

ప్రధాన రోడ్లు ఇలా ఉంటే ఆయా కాలనీల్లో ఉండే గల్లీ రోడ్లు, కాలనీ రహదారులు మరింత అధ్వానంగా తయారయ్యాయి. పట్టణంలోని సర్‌సిల్క్, సర్దార్ బస్తీ, ఎస్పీఎం కాలనీలు, బాలాజీ నగర్, పెట్రోల్ పంపు, మార్కెట్ ఏరియా, నిజాముద్దీన్ కాలనీ, రిక్షా కాలనీ, నౌగాం బస్తీ, రైల్వే కాలనీ తదితర కాలనీల్లో అంతర్గత రోడ్లు చెడిపోయాయి. భారీవర్షాలకు ఈ రోడ్లపై నడకే నరకప్రాయంగా మారిందని ఆరోపణలున్నాయి. కొన్ని చోట్ల బురదమయంగా మారడంతో తీవ్రఇబ్బందులు పడాల్సి వచ్చిందని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్లపై ప్రత్యేక దృష్టి

పట్టణంలోని రోడ్లపైకి ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం. వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు కొన్నిచోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. అంతర్గత రోడ్లు, ఇతర రోడ్లు మరమ్మతులు చేపట్టేందుకు మున్సిపల్ సర్వసభ్య సమావేశాల్లో పాలకవర్గ సభ్యులు చర్చించారు.

-అంజయ్య, మున్సిపల్ కమిషనర్, కాగజ్‌నగర్

రైతులకు లాభదాయకమైన పనులు చేపట్టాలి

జైనూర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామీణప్రాంత రైతులకు ఈజీఎస్ ద్వారా లాభదాయకమైన పనులను చేపట్టాలని ఈజీఎస్ రాష్ట్ర ప్రాజెక్ట్ మేనేజర్ నరేష్ కోరారు. మండలంలోని మార్లావాయిలో బుధవారం ఆయన ఉపాధి పనులను పరిశీలించారు. గ్రామాల్లోఉపాధిపనులు పారదర్శకంగా చేపట్టాలని కూలీలకు సరిపడువేతనాలు అందేలాచర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పెద్దమొత్తంలో నర్సరీలను ఏర్పాటుచేసి పంటపొలాల్లో చెట్లు నాటాలని కోరారు. ఈ సందర్భంగా ఏపీడీవో సుధాకర్‌రెడ్డి, ఇన్‌చార్జీ ఎంపీవో మోహన్, ఏపీవో నగేష్, మాజీసర్పంచ్ కనకప్రతిభ, కార్యదర్శి, కారోబార్,గ్రామస్థులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

బెజ్జూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బుధవారం మత్స్యకారులు ఘనంగా గంగామాత విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిం చారు. గంగామాత విగ్రహాన్నిబాజాభజంత్రీలతో, మంగళహారతుల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రతిష్ఠించారు.

దేశీదారు పట్టివేత

కాగజ్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి కాగజ్‌నగర్‌కు బుధవారం అక్రమంగా తరలిస్తున్న దేశీదారు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ రవి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు కాగజ్‌నగర్‌కు చెందిన రతన్‌లాల్ అనేవ్యక్తి వీరూర్ నుంచి కాగజ్‌నగర్‌కు బైక్‌పై అక్రమంగా దేశీదారు బాటిళ్లను తరలిస్తుండగా పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఆయన వద్ద 200 దేశీదారు బాటిళ్లను లభించినట్టు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

పోలీసు అమరవీరుల దినోత్సవం



కాగజ్‌నగర్, పెంచికలపేటలో పోలీసుల కొవ్వొత్తుల ర్యాలీ

కాగజ్‌నగర్/పెంచికలపేట/దహెగాం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో బుధవారం రిటైర్డ్‌ఎంప్లాయిస్ ఉద్యోగసంఘభవన్‌లో పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్‌ఎంప్లాయిస్ ఉద్యోగులసంఘం అధ్యక్షుడు జయదేవ్ మాట్లాడుతూ ప్రజలకోసం పోలీసులు తమప్రాణాలను పణంగా పెడతారన్నారు. కాగజ్‌నగర్, పెంచికలపేటలలో సీఐ శంకరయ్య, ఎస్సై కొమరయ్య ఆధ్వర్యంలో కొవ్వొత్తులర్యాలీ నిర్వహించారు. పోలీసు అమరవీరుల త్యాగం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ఎస్సై దీకొండ రమేష్‌తో పాటు పోలీసులు, యువకులు లహన్‌రాజ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. దహెగాం మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోలీసు స్టేషన్‌లో బుధవారం ఎస్సైరాజు ఓపెన్‌హౌజ్ కార్యక్రమం నిర్వహించారు.

ఆయుధాల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు పలు విషయాలు అడిగితెలుసు కున్నారు. కార్యక్రమంలో ఏఎస్సై రమేష్, ఉపాధ్యా యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శలు..

వాంకిడి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన పిప్పిరి రమేష్ ఆసిఫాబాద్ మండలకేంద్రంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. బుధవారం ఆయనను మాజీ జడ్పీటీసీ అజయ్‌కుమార్ పరామర్శించారు. చికిత్సకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు.

బెజ్జూరు: మండలంలోని పాపనపేట మాజీసర్పంచ్ బుజాడిశేఖర్ అన్న కుమారుడు దివాకర్ మంగళవారం రాత్రి మృతి చెందాడు. బుధవారం బాధిత కుటుంబాన్ని జడ్పీమాజీచైర్మన్ కోనేరు కృష్ణారావు పరామర్శించారు. వారికుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు.

టీకాలను వేయించుకోవాలి

వాంకిడి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వ్యాధినిరోధకటీకాలను సకాలంలో వేయించుకోవాలని హెచ్‌ఈవో రవిదాస్ అన్నారు. బుధవారం కిరిడిగ్రామంలోని ఉపకేంద్రంలో గర్భిణులు, బాలింతలకు, చిన్నపిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వేశారు.కార్యక్రమంలో కృష్ణకుమారి, సౌమ్య పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

ఆసిఫాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : సినీనటుడు ప్రభాస్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బుధవారం ప్రభాస్‌ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.సభ్యులు జనార్దన్, నాగేష్, శ్రీకాంత్, గోపాల్, సాయికిరణ్‌పాల్గొన్నారు.

ఆక్రమణలపై విచారణ

పెంచికలపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో సర్వేనెం.61లోప్రభుత్వభూములను ఆక్రమించారని పలువురు ఫిర్యాదు చేయగా బుధవారం తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఇరిగేషన్ ఈడీ భద్రయ్యతో కలిసి సర్వే చేశారు. ఎల్కపల్లి గ్రామంలో సర్వేనెం.61, బొక్కివాగు ప్రాజెక్టు శిఖభూముల హద్దులను గుర్తించారు.

ఉపాధిహామీ గ్రామసభలు

దహెగాం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామపంచాయతీల్లో ఈ నెల24నుంచి జాతీయ ఉపాధిహామీ గ్రామసభలను నిర్వహిస్తున్నట్లుఎంపీడీవో రాజేందర్ తెలిపారు. 2025-26 సంవత్సరానికి గానుపనులు చేపట్టడానికి పనులు గుర్తిస్తామన్నారు.

అంకుసాపూర్‌లో గ్రామసభ

కాగజ్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకుసాపూర్‌లో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో రమేష్ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం 2025-26 కోసం పనులను ఎంపిక చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో బుచ్చన్న, సాంకేతికసహాయకుడు తోయిబ్, కార్యదర్శి రాజేశ్వర్, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

కోసినిలో పొలంబాట

కాగజ్‌నగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసినిలో బుధవారం పొలంబాట నిర్వహించారు. ట్రాన్స్‌కో రూరల్ ఏఈరాంప్రసాద్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ కనెక్షన్లకు కెపాసిటర్లను బిగించుకోవాలని సూచించారు. విద్యుత్ సంబంధించిన ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.



పెన్షన్ పెరుగుదలకు కార్మిక సంఘాలు చొరవ చూపాలి

మందమర్రి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో మూడు నుంచి నాలుగు దశాబ్దాలపాటు సంస్థ అభివృద్ధి కోసం పని చేసి ఉద్యోగవిరమణపొందిన రిటైర్డు కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉందని రిటైర్డు కార్మికులు వాసాలశంకర్ పేర్కొన్నారు. బుధవారం మందమర్రిలో రిటైర్డు కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగంలో ఉన్నప్పుడే యాజమాన్యాలు, సంఘాలు గుర్తిస్తున్నాయని, రిటైర్డు అయినతర్వాత పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. 11వవేజ్‌బోర్డు పెన్షన్ విధానాన్ని అమలుచేసి ఏరియర్స్ చెల్లించాలని పేర్కొన్నారు. రెండుదశాబ్దాల క్రితం రిటైర్డు అయిన ఉద్యోగులకు వెయ్యిలోపు పెన్షన్ వస్తుందని, ప్రభుత్వ పెన్షన్ కంటే వెయ్యి రూపాయలు తక్కువగా రావడం, కుటుంబాలు ఎలా గడుస్తాయని పేర్కొన్నారు. దీనికితోడు వృద్ధాప్యం, వ్యాధులు వారిని వెంటాడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. కార్మికసంఘాలు కూడా పట్టించుకోవడం లేదన్నారు. తమన్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కుటుంబాలతో దీక్షలు చేపడతామని పేర్కొన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం తమ పరిస్థితిని అర్థం చేసుకొని కొత్తపెన్షన్ విధానాన్ని అమలు చేస్తే బాగుంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సభ్యులు సర్జన్, గట్టయ్య, కొమురయ్య, ఎల్లారం, తదితరులు పాల్గొన్నారు.

కాలానుగుణంగా ఆధునిక వసతులు



గదులను ప్రారంభిస్తున్న జీఎం

శ్రీరాంపూర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కాలానుగుణంగా ఉద్యోగులకు ఆధునికవసతులు కల్పిస్తున్నట్లు ఏరియా జీఎం బి సంజీవ రెడ్డి అన్నారు. ఏరియా ఇంజనీర్, ఫైనాన్స్ విభాగం గదులను ఆధునీకరించగా, ఆయన బుధవారం ప్రారంభించి మాట్లాడారు. కంపెనీకల్పించే వసతులను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, శ్రీరాంపూర్, ఇందారం ఓసీపీల పీవోలు, తదితరులు పాల్గొన్నారు.

జీఎంను సన్మానించిన ఉద్యోగులు

శ్రీరాంపూర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జీఎం(సర్వే)గా పని చేస్తూ ఈనెలలో రిటైర్‌కానున్న జైనులద్దీన్‌ను శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డిఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఆయన సింగరేణికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, ఇందారం ఓసీపీ పీవోపీవీరెడ్డి, ఏజెంట్లురాముడు,శ్రీధర్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్, ఏరియా సర్వే అధికారి వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించాలి: జీఎం

మందమర్రి టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాకు 2024-25ఆర్థికసంవత్సరానికి నిర్దేశించిన వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించాలని మందమర్రి జీఎం దేవేందర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఏరియాలోని గనులకు నిర్దేశించిన రోజువారీ లక్ష్యం కంటే అదనపుఉత్పత్తి సాధించేందుకు ఉద్యోగులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఏరియాలోని గనుల్లో కేకే5 గనిపనితీరు బాగుందన్నారు. కార్మికసంక్షేమానికి యాజమాన్యం పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు.

క్వార్టర్ల మార్పిడి కోసం కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): క్వార్టర్ల ఎక్స్ఛేంజ్ కోసం బుధవారం శ్రీరాంపూర్‌లోని ప్రగతిమైదానంలో ఉన్న సీఈఆర్ క్లబ్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏరియాలో ఉన్న 290క్వార్టర్లకు గాను 532ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 107మంది ఉద్యోగులు చేంజ్‌ఆఫ్ క్వార్టర్లను తీసుకున్నారు.

సింగరేణి ఉద్యోగులకు క్రెడిట్‌పై నూతన వస్త్రాలు

మందమర్రి టౌన్, అక్టోబర్ 23 : మందమర్రి ఏరియాలోని సింగరేణి ఉద్యోగులకు దీపావళి పండుగను పురస్కరించుకొని క్రెడిట్‌పై నూతన వస్త్రాలను ఖాదీసంస్థ వారు ఇస్తున్నారని మందమర్రి ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ తెలిపారు. బుధవారం సీఈఆర్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన ఖాదీ వస్త్రాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 20వేలవరకు క్రెడిట్‌పై దుస్తులు ఇస్తారని తెలిపారు. ఈనెల23నుంచి 29వరకు వారం రోజులపాటు విక్రయిస్తున్నారని తెలిపారు. కార్మికులు ఎవరైనా దుస్తులు తీసుకుంటే వారి జీతాలునుంచి రికవరీ చేస్తామన్నారు. దీంతో పాటు టవల్స్, చద్దర్లు,లుంగీలు, అన్నిరకాల దుస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. కొనుగోలు చేసిచేతివృత్తి వారికి పనికల్పించాలని తెలిపారు.

ఎస్‌అండ్‌పీసీ పిట్ కమిటీ

శ్రీరాంపూర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఎస్‌అండ్‌పీసీ పిట్ కమిటీని ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు సమక్షంలో ఎన్నుకున్నారు. పిట్‌కార్యదర్శిగా పూదరిసాంబయ్య, సహాయ కార్యదర్శిగా పోలం శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు చక్రధర్, ప్రచారకార్యదర్శులుగా శ్రీనివాస్, సత్యనారాయణ, ముఖ్యసలహాదారులుగా అంజనేయులు, విజయ్‌కుమార్ తోపాటు రిలేకార్యదర్శులను ఎన్నుకున్నారు.

సీఈఆర్ క్లబ్‌లో ఖాదీ మేళా

రెబ్బెన, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా గోలేటి సీఈఆర్ క్లబ్‌లో వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాన్ (జమ్మికుంట) వారు ఏర్పాటు చేసిన ఖాదీమేళా స్టాల్స్‌ను బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖాదీమేళాను సింగరేణి ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ నెల 29 వరకు ఈమేళా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం కెరాజమల్లు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, నిర్వాహకులు చంద్రమౌళి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ప్రగతికి మూలస్తంభాలు కార్మికులు

మందమర్రి టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సింగరేణి ప్రగతికి మూలస్తంభాలు ఉద్యోగులని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బి జనక్‌ప్రసాద్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిస్టేడియంలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పారిశ్రామిక సంబంధాల సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకేగమ్యం, ఒకేలక్ష్యం, ఒకేకుటుంబం అనేనినాదంతో అందరూ అంకితభావంతో పనిచేస్తున్నారన్నారు. నాయకులంటేనే కార్మికుల కోసం పనిచేసే సేవకులనే విషయాన్ని గుర్తుంచుకొని ప్రతీ ఒక్కరు పనిచేయాలన్నారు. ఈ ప్రారంభోత్సవానికి జీఎం కోఆర్డినేషన్ సుభాని, లక్ష్మీనారాయణ, అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయ ఆవరణలో స్వచ్ఛత

రెబ్బెన, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి జీఎం కార్యాలయ ఆవరణలో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది అంతా కలిసి పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం జీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ సచ్ఛత కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొనాలన్నారు. తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం రాజమల్లు, ఏరియా ఇంజనీర్ భీంరావు, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంఎస్‌లో నూతన నియామకాలు

శ్రీరాంపూర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎంఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం యూనియన్ కార్యాలయంలో జరిగింది. ముఖ్యఅతిథిగా యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రియాజ్‌అహ్మద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కొంత మంది నాయకులను ఏరియా కమిటీలోకి తీసుకున్నట్లు తెలిపారు. ఏరియా జాయింట్‌ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా సదిరం రాజేంద్రప్రసాద్, బొడ్డు సురేందర్ నియామకమయ్యారు.

ఆర్‌కే7పిట్ కార్యదర్శిగా చెవుల శ్రీనివాస్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శిగా మీసాల మహేందర్, ఆర్‌కే న్యూటెక్ పిట్ కార్యదర్శి తుల అనిల్‌ను నియమించారు. త్వరలోమరిన్నినియామకాలు చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. సమావేశంలో ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సర్ఫేస్ జనరల్‌మజ్దూర్ పోస్టుల కోసం కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సర్ఫేస్ జనరల్‌మజ్దూర్ పోస్టుల కోసం బుధవారం జీఎం కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. అనారోగ్య సమస్య ఉన్న వారికి పది ఖాళీలుండగా, వారికి ఎస్‌వోటుజీఎం ఎన్ సత్యనారాయణ కౌన్సెలింగ్ ప్రారంభించారు. వారి మెడికల్‌రిపోర్టులను కమిటీ సభ్యులు పరిశీలించారు. గురు, శుక్రవారాల్లో సైతం కొనసాగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) కె చిరంజీవులు, డిప్యూటీ సీఎంవో డాక్టర్ రమేష్‌బాబు, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సమీరా సంధాని, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వినూత్న ఆలోచనలకు వేదిక స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల వినూత్న ఆలోచనలకు వేదిక స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్-2024అని డీఈవో యాదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పాఠశాలల 6-12వతరగతి విద్యార్థులు http://schoolinnovationmarathon.org/lp/ వెబ్‌సైట్ వేదికగా పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రతీ పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడు పాల్గొనే జట్లకు ఫోకల్ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో విద్యార్థులు పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు చూడాలని, రిజిస్ట్రేషన్, కోర్సు పూర్తి, ఐడియా, ప్రోటోటైపింగ్ సమర్పణకు ఉపాధ్యాయుల సహకారం తీసుకోవాలని, నవంబర్ 30లోపు పూర్తి చేయాలని, జిల్లా సైన్స్ అధికారి 9849550200 నెంబర్‌ను సంప్రదించాలని డీఈఓ సూచించారు.

చదువుపై శ్రద్ధ వహించాలి

లక్షెట్టిపేటరూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థుల చదువులపై వార్డెన్‌లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా దళిత అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం ప్రభుత్వ బాలుర ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్ వసతి గృహాలతోపాటు బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని తెలుసుకున్నారు. విద్యార్థులకు జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలుంటే సకాలంలో వైద్యం అందించాలని సూచించారు. వసతి గృహాల్లో చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. కిచెన్ డైనింగ్‌హాల్, ఇతర పరిసరాలను పరిశీలించి, రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. వసతి గృహ సంక్షేమాధికారి కిశోర్, రాజు, సునీత, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలి

దండేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చక్కటి విద్యాబోధన అందించి వారి ఉన్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి దుర్గం చిన్నయ్య సూచించారు. కస్తూర్బా బాలికల విద్యాలయం, ఎంపీపీఎస్ పాఠశాలను బుధవారం ఎంఈవో సందర్శించారు. పాఠశాలలోని జరుగుతున్న సమ్మేటివ్(ఎస్ఏ1) పరీక్ష నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. సీసీవో చుంచు మల్లేష్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్వో, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

మహిళలకు అండగా..

మహిళలు ఆర్థిక ప్రగతితోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటున్నారు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని పలు వ్యాపారాలు నిర్వహిస్తూ కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేయడంతోపాటు సామాజిక సేవ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. రుణాలను సకాలంలో చెల్లిస్తూ ప్రశంసలు పొందుతున్నారు. మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏమి లేదని నిరూపిస్తున్నారు.



బ్యాంకు నుంచి చెక్కులు అందుకుంటున్న మహిళలు

- స్వయం ఉపాధి కోసం బ్యాంకుల ద్వారా రుణాలు
- రూ.5లక్షల నుంచి 15 లక్షల వరకు అందజేత
- ఐకేపీ, మెప్మా అధికారుల పర్యవేక్షణ
- సామాజిక సేవా కార్యక్రమాల్లో సైతం ముందంజ

మందమర్రిటౌన్/కాగజ్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద రుణాలు అందజేస్తోంది. ఐకేపీ ద్వారా మహిళశక్తి పేరిట రుణాలు ఇస్తోంది. ఇందులో భాగంగా ఇందిర మహిళా శక్తి క్యాంటిన్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, కిరాణం, సారీ సెంటర్ తదితర వ్యాపారాలు నిర్వహిస్తూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళ సంఘం నిధులు, స్త్రీ నిధి, ముద్ర, పీఎం ఈజీఏస్ ఇలా పలు పథకాల కింద రుణాను మంజూరు చేసేందుకు అవకాశం కల్పించింది. వ్యాపార నిమిత్తం వ్యక్తిగత రుణాలు కాకుండా ఐదు నుంచి పది మహిళలు గ్రూపును యూనిట్‌గా పరిగణలోకి తీసుకొని బ్యాంకు ద్వారా రుణం అందిస్తున్నారు. వ్యాపారానికి ఒక్కక్క యూనిట్‌కు రూ.5లక్షల నుంచి రూ.20లక్షల వరకు బ్యాంకు రుణాలు అందించి 60 వాయిదాల్లో కట్టేందుకు ఒప్పందాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు కాగజ్‌నగర్‌లో 20 మేరకు వివిధ పథకాల కింద రుణాలను తీసుకొని చిరు వ్యాపారాలు ప్రారంభించారు. మెప్మా సిబ్బంది గ్రూపులకు రుణాల క్లియరెన్స్ కోసం అనుసంధానం చేసి ఇవ్వడంతో సంబంధిత బ్యాంకు అధికారులను నిధులను విడుదల చేస్తున్నారు. ఈ నిధులు రావడంతో నేరుగా వ్యాపారాన్ని మహిళలే నిర్వహిస్తున్నారు.



రుణాల వివరాలు తెలుసుకుంటున్న ఆదనపు కలెక్టర్ దీపక్ తివారి

మందమర్రిలో...

మందమర్రిలో 835 గ్రూపులు ఉన్నాయి. ఒక్కొక్క గ్రూపులో 12మంది చొప్పున 8352మంది సభ్యులు గ్రూపుల్లో కొనసాగుతున్నారు. మహిళా గ్రూపులు దాదాపు రూ.146.92 లక్షలు రుణాలు తీసుకొని చెల్లించారు. పావలా వడ్డీ రుణాలను వీరు సద్వినియోగం చేసుకుంటున్నారు. స్వయం సహాయక సంఘాలు ప్రభుత్వ, వ్యక్తిగత రుణాలను తీసుకొని ఆర్థిక అవసరాలను తీర్చుకోవడంతో పాటు వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టి రాణిస్తున్నారు. ఆరు సంవత్సరాలుగా పావలా వడ్డీ రుణాల కింద రూ.12 కోట్లకు పైగా బ్యాంకుల నుంచి రుణాలు పొంది వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టి పురోగతిని సాధించారు. సంఘాల పని తీరుకు సంబంధించి 39మంది రిసోర్స్ పర్సన్‌లు పని చేస్తున్నారు. వీరికి ప్రభుత్వం రూ.6వేలు, సమాఖ్య నుంచి రూ.3వేలు వేతనం చెల్లిస్తున్నారు. శ్రీనిధి రుణాలకు సంబంధించి మూడేళ్ళుగా వరుసగా డీఆర్‌డీఏ నుంచి ప్రశంస పత్రాలను పొందారు. సమాఖ్య సంఘాల సభ్యులు ఎవరైనా బ్యాంకు ద్వారా రుణాలు పొంది అనారోగ్యం, రోడ్డు ప్రమాదంలో మృతి చెందితే ప్రమాద బీమా కింద శ్రీనిధి నుంచి రుణ మాఫీ చేస్తున్నారు.

ప్రభుత్వ పథకాల ప్రచారం

స్వయం సహాయక సంఘాల సభ్యుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి, పరస్పరం తోడ్పాటుతోపాటు ప్రభుత్వ పథకాలను ప్రచారం చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు ర్యాలీలు చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. మొక్కలు నాటాలని అవగాహన కల్పిస్తున్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో వార్డుల వారీగా వెళ్లి పరిసరాల పరిశుభ్రతకు పాటుపడుతున్నారు. ప్రభుత్వం చేపట్టే ప్రతీ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల ఎంతో ఉంది.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్..



ఐకేపీ అధికారులు, మెప్మా సిబ్బంది రూ.6లక్షల రుణం ఇప్పించడంతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభించాం. ఆరు నెలల క్రితం ఉత్పత్తి ప్రారంభించాం. కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాల, కరీంనగర్, సిర్పూరు, మహారాష్ట్ర వరకు మార్కెటింగ్ చేస్తున్నాం.

-రజిత, కాగజ్‌నగర్

బేకరీ నిర్వహణ



బేకరీ నిర్వహణకు రుణం కోసం దరఖాస్తు చేశాను. స్వయం సహాయక సంఘాల్లో గతంలో తీసుకున్న రుణం చెల్లంచడంతో ఇబ్బందులు లేకుండా మంజూరైంది. రూ.4.39 లక్షలు రావడంతో వ్యాపారం ప్రారంభించాం. కుటుంబ సభ్యుల సహకారంతో వ్యాపారం కొన సాగుతోంది.

-ఎస్.లక్ష్మి, కాగజ్‌నగర్

కిరాణ షాపుతో ఉపాధి



పదేళ్ళ క్రితం స్వయం సహాయక సభ్యురాలుగా గ్రూపులో చేరాను. ఇటీవల శ్రీనిధి కింద లక్ష రూపాయల రుణం పొందాను. ప్రతీ నెల గ్రూపులో డబ్బులు చెల్లిస్తున్నా. ఇటీవల అనారోగ్యంతో భర్త మృతి చెందాడు. జీవనోపాధి లేకపోవడంతో రుణం తీసుకొని కిరాణ షాపు ఏర్పాటు చేసుకున్నా. శ్రీనిధి నిధులతో నా కుటుంబ పోషణ లభించింది.

- మేరుగు మానస, మందమర్రి

ఉపాధితోపాటు పలువురికి శిక్షణ



గతంలో టైలరింగ్ శిక్షణ పూర్తి చేశాను. షాపు ఏర్పాటుకు లక్ష రూపాయలు రుణం పొందాను. బ్యూటీ పార్లర్, మగ్గం వర్క్స్ కూడా చేస్తున్నాను. పండుగలతో పాటు ఇతర సమయాల్లో మంచి గిరాకీ వస్తుంది. దీంతో ఆర్థికంగా ప్రగతిని సాధించాను. పలువురికి శిక్షణ ఇస్తున్నా.

- పెగుడ ఉమాదేవి, టైలరింగ్, మ్యాచింగ్ సెంటర్, మందమర్రి

దీపావళికి కొత్త రెవెన్యూ చట్టం...!

5వ పేజీ తరువాయి...

భూముల రక్షణకు సిబ్బంది



గ్రామస్థాయిలో భూముల రక్షణకు, రెవెన్యూ సేవలకు ఒక సహాయకుడిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం వీఆర్ఏల ను, వీఆర్వోల్లో అర్హులైన వారిని పరీక్ష ద్వారా ఎంపిక చేయడం ద్వారా గ్రామ రక్షణ సిబ్బందిని నియమించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వం రెవెన్యూ నుంచి తొలగించిన వీఆర్ఏ, వీఆర్వోలను తిరిగి అదే వ్యవస్థలో కొనసాగించే ఆలోచనలో ఉన్న కాంగ్రెస్ సర్కారు వారి ద్వారా గ్రామాల్లో సేవలు పొందాలనే తలంపుతో ఉంది.

తుది దశలో ప్రక్రియ

ప్రస్తుతం అమలులో ఉన్న తెలంగాణ పట్టాదారు పాస్ పుస్తకాలు, యాజమాన్య హక్కుల చట్టం-2020 స్థానంలో ఆర్వోఆర్ 2024 రూపకల్పన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. డ్రాఫ్ట్‌పై అభిప్రాయాలను క్రోడీకరించిన అధికారులు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ముసాయిదా పత్రాన్ని అందజేశారు. చట్టం రూపకల్పనకు సంబంధించిన కార్యాచరణపై మంత్రి తాజాగా సీఎంతో చర్చించినట్లు తెలిసింది. త్వరలో జరగనున్న మంత్రి మండలి సమావేశంలో ముసాయిదాపై చర్చించనున్నారు. అనంతరం శాసనసభ సమావేశాల్లో ఆమోదించడం ద్వారా గానీ, ఆర్డినెన్స్ జారీ ద్వారా కొత్త చట్టాన్ని దీపావళి నుంచి అమలులోకి తీసుకురావాలన్న యోచనలో ప్రభుత్వం ఉంది.

ఎన్ఐసీకి బదలాయింపు...

ధరణి పోర్టల్‌ను ప్రైవేటు సంస్థ నుంచి ప్రభుత్వ సంస్థ అయిన ఎన్ఐసీకి బదలాయింపు ప్రక్రియను ప్రభుత్వం ఇటీవల పూర్తి చేసింది. ధరణి పోర్టల్‌లోని పెండింగ్ దరఖాస్తులను ప్రత్యేక డ్రైవ్ ద్వారా దాదాపు పరిష్కరించారు. కొత్త చట్టంతో ముడిపడి ఉన్న అంశాలకు సంబంధించిన దరఖాస్తులే మిగిలినట్లు సమాచారం. నూతన చట్టంలో సాదా బైనామాల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించగానే పోర్టల్‌లో ఆప్షన్లు ఇవ్వడం ద్వారా రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేసేందుకు వీలు కలుగనుంది. ఇంతకాలం ఆర్వోఆర్ చట్టంలో వెసలుబాటు లేక సాదా బైనామాలు పెండింగ్ పడుతూ వస్తుండగా, కొత్త చట్టంతో ఆ సమస్యకు పరిష్కారం లభించనుంది.

లక్ష్యంతో చదివి.. ఉద్యోగం సాధించి...



చుంచు కార్తికేయ

బెల్లంపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : లక్ష్యాన్ని ఎంచుకుని ప్రణాళికతో చదివితే సాధించలేనిది ఉండదని నిరూపించాడు ఆ యువకుడు. పట్టణంలోని హనుమాన్ బస్తీకి చెందిన ఆటో డ్రైవర్ చుంచు రమేష్-రజితల కుమారుడు కార్తికేయ స్థానిక పాఠశాలలో పదోతరగతి పూర్తి చేసుకుని ఇంటర్ సోషల్ వెల్ఫేర్ కళాశాలలో, డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో పూర్తి చేశాడు. బీఎస్ఎఫ్ (సరిహద్దు భద్రత దళం)లో ఉద్యోగాల నోటిఫికేషన్ రావడంతో తిలక్ మైదానంలో కఠోర సాధన చేస్తూ పరీక్షలు రాశాడు. పరీక్షల్లో ఉత్తీర్ణుడు కావడంతో బీఎస్ఎఫ్ లో ఉద్యోగం వచ్చింది. ఏడాది పాటు ట్రైనింగ్ పూర్తి చేసుకున్నాడు. బీఎస్ ఎఫ్ పరేడ్ కమాండర్‌గా వచ్చే నెల 3న అస్సాం రాష్ట్రంలో విధుల్లో చేరను న్నాడు. కార్తికేయ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి ఆర్మీలో చేరి దేశ సేవ చేయాలనే ఆలోచన ఉండేది. అదే పట్టుదలతో కష్టపడి చదివి బీఎస్ఎఫ్‌లో ఉద్యోగం సాధించాను.

క్రీడా సమాచారం

1న జోనల్ స్థాయి స్విమ్మింగ్ పోటీలు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నవంబర్ 1న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అండర్-14, 17 జోనల్‌స్థాయి (ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా) బాలబాలికల స్విమ్మింగ్ పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాంతారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు వయసు ధ్రువీకరణ, బొనఫైడ్ సర్టిఫికెట్‌తో ఉదయం 9 గంటలకు పోటీల కన్వీనర్ రాష్ట్రపాల్‌కు రిపోర్టు చేయాలని సూచించారు. వివరాలకు 7702035200 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఎస్‌జీఎఫ్ అండర్-17 హాకీ ఎంపిక పోటీలు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్-17 బాలుర హాకీ ఎంపిక పోటీలను జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 25న ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా పాఠశాల క్రీడల ప్రధాన కార్యదర్శి కాంతారావు తెలిపారు. పోటీలకు జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు పాల్గొనేందుకు అర్హులని, కేబీ కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ ఉత్తం, పీడీ హేమంత్‌లకు ఉదయం 10 గంటలకు రిపోర్టు చేయాలని ఆయన సూచించారు.

జాతీయస్థాయి బాడ్మింటన్ పోటీలకు ఎంపిక



ఆరాధ్య

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): అస్సాంలోని డిబ్రుగర్‌లో ఈనెల 25 నుంచి 30వరకు జరగనున్న అండర్-13 జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ మేయిన్ డ్రా పోటీలకు జిల్లా క్రీడాకారిణి జీ ఆరాధ్య డబుల్స్ విభాగంలో ఎంపికైందని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్ తెలిపారు. హైదరాబాద్ క్రీడాకారిణి అభ జాదవ్‌తో కలిసి ఆరాధ్య పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. జాతీయస్థాయి ర్యాంకింగ్ పోటీల్లో 21వ ర్యాంకు సాధించిన ఆరాధ్యను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ బాధ్యులు అభినందించారు.

జాతీయస్థాయి బాడ్మింటన్ పోటీల్లో జిల్లా క్రీడాకారుడు



ఆదిత్య హర్షవర్ధన్

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో ఈనెల 20వ తేదీ నుంచి 25వరకు జరుగుతున్న సబ్ జూనియర్ అండర్-15 జాతీయ స్థాయి బాడ్మింటన్ పోటీల్లో జిల్లా క్రీడాకారుడు ఆదిత్య హర్షవర్ధన్ పాల్గొన్నాడని జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుధాకర్ తెలిపారు. మిక్స్‌డ్ డబుల్ విభాగంలో హైదరాబాద్ క్రీడాకారిణి జీ రిషిత పాండేతో కలిసి పోటీల్లో పాల్గొన్నారు.

జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ క్రీడాకారిణికి సన్మానం

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కిక్ బాక్సింగ్‌లో విజయం సాధించిన కీర్తి అగర్వాల్, కోచ్ రాజేష్‌ను పట్టణంలోని బాలురు ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం మంచిర్యాల ఫిట్‌నెస్ సెంటర్ సభ్యులు సన్మానించారు. సెంటర్ అధ్యక్షుడు దారాకుమార్, తులా అంజనేయులు, రామన్న పాల్గొన్నారు.

నందనవనం

- 3 గుంటల్లో వివిధ రకాల మొక్కలు



ఇంటి ఎదుట అల్లుకున్న వివిధ రకాల మొక్కలు



చెట్లకు నీరు పోస్తున్న లక్ష్మయ్య అతని భార్య

బెల్లంపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంపై ఆసక్తితో లక్ష్మయ్య ఇంటిని పచ్చని పొదరిల్లుగా మార్చాడు. కాల్‌టెక్స్ ఏరియాలోని లక్ష్మయ్య ఇంటికి వెళితే వివిధ రకాల మొక్కలతో అల్లుకున్న తీగలు ఇంట్లోకి స్వాగతం పలుకుతాయి. సింగరేణిలో జూనియర్ మైనింగ్ అధికారిగా పనిచేసి పదవి విరమణ పొందాడు. 6గుంటల స్థలంలో 3 గుంటల్లో ఇల్లు, మరో 3 గుంటల్లో వివిధ రకాల పండ్లు, పూల మొక్కలతో చిన్నపాటి గార్డెన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. లక్ష్మయ్య ఇంట్లో విరివిగా మొక్కలు పెంచడంవల్ల చల్లదనాన్ని ఆస్వాదిస్తున్నారు. జామ, నిమ్మ, కొబ్బరి, తమలపాకు, పూల మొక్కలు, వివిధ ఆరోగ్యానికి సంబంధించిన ఔషధ మొక్కలను పెంచుతున్నారు. వీధిలోకి వెళ్లే ప్రతీ ఒక్కరు లక్ష్మయ్య ఇంటి వైపు చూస్తూ వెళ్లే విధంగా పచ్చని పొదరిల్లులా ఇల్లు కనబడుతోంది. మొక్కల సంరక్షణ, కొత్త మొక్కల కొనుగోలుకు ప్రతీ నెల రూ.2 వేలు ఖర్చు చేస్తున్నాడు. ఉదయం, సాయంత్రం కుటుంబీకులతో మొక్కలకు, చెట్లకు నీళ్లు పెడుతున్నారు.

కళాత్మక ఉపాధి

- హైమావతి దిండ్లకు భలే గిరాకీ
- రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ప్రదర్శన
- బంధువుల ద్వారా విదేశాలకు పంపిణీ

కాగజ్‌నగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : ఆమె చేతిలో పడగానే దూదికి కొత్త రూపు వస్తుంది. దూది, వస్త్రంతో కళాత్మకంగా ఆమె చేసిన దిండ్ల విక్రయాలతో ఉపాధి లభిస్తోంది. దిండ్లను చూడగానే సోఫాలోనో, కారు వెనుక సీట్లలో పెట్టుకోవాలనే ఆలోచన కలుగుతుంది. ఈ విధమైన దిండుల తయారీలో తనకంటూ ప్రత్యేకత నిలుపుకుంటున్నారు హైమావతి.

కాగజ్‌నగర్‌కు చెందిన సుద్దాల హైమావతి హ్యాండ్‌మేడ్ వస్తువుల తయారీలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకొంది. మార్కెట్ డిమాండును బట్టి వివిధరకాల డిజైన్స్‌తో కూడిన దిండులు, మ్యాట్‌లు, పూజాసామగ్రి వస్తువులు తయారు చేస్తోంది. కారులో పెట్టుకునే దిండులు, ఇంట్లో వాడుకునే బెడ్ షీడ్‌లకు చక్కటి రంగులు వేస్తుంది. పూజగదిలో వాడే రకరకాల వస్తువులను వివిధ డిజైన్లలో తయారు చేస్తోంది. ఈమె తయారు చేసిన వస్తువులన్నింటిని ఐకేపీ సౌజన్యంతో జోడెఘాట్‌తోపాటు హైదరాబాద్, మంచిర్యాల పట్టణాల్లో ఏర్పాటు చేసిన స్టాళ్లలో ప్రదర్శన పెట్టారు.

తయారీకి ప్రేరణ ఇలా..

కాగజ్‌నగర్‌కు చెందిన హైమావతి, రాజేందర్ దంపతులు ఓల్డు కాలనీలో నివసిస్తారు. రాజేందర్ ఎస్పీఎంలో ఉద్యోగం చేస్తున్నారు. 2014లో మిల్లు మూతబడటంతో ఒక్కసారిగా పరిస్థితులు మారాయి. 2019లో కరోనా రావటంతో మరింత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. మిల్లు మూసివేయడం, ఉపాధికి బయటకు పోలేని పరిస్థితి రావటంతో దూదితో ఇంట్లోనే చక్కటి డిజైన్‌లలో దిండులను తయారు చేసింది. వాటికి ఆకర్షితులైన పట్టణంలో కార్ల యజమానులు దిండులను కొనుగోలు చేసేవారు. అలా ఉపాధి మార్గాన్ని ఎంచుకొంది.



తయారు చేసిన హ్యాండ్ మేడ్ వస్తువులు



హ్యాండ్ మేడ్ వస్తువులను తయారు చేస్తున్న హైమావతి



రంగులతో తయారు చేసిన బెడ్ షీట్స్

కరోనా సమయంలోనే ఆర్థిక బాటలు..

కరోన సమయంలో క్లిష్టమైన పరిస్థితులు రావటంతో హ్యాండ్‌మేడ్ వస్తువులను తయారు చేయడం మొదలుపెట్టాను. దిండ్లు, మ్యాట్‌లకు మార్కెట్లో గిరాకీ లభిస్తోంది. బెడ్‌షీట్‌కు రంగులతో డిజైన్ చేస్తున్నా. కుటుంబ సభ్యులంతా సహకరించటంతోనే వస్తువుల తయారీ సులువైంది. పలు స్టాళ్లలో ఉత్పత్తులు ప్రదర్శించాను. ఎమ్మెల్యే, మంత్రులు కొనుగోలు చేసి అభినందించారు. అమెరికా, ఇతరరాష్ట్రాల వారు కూడా బంధువుల ద్వారా తాను తయారు చేసిన వస్తువులను కొనుగోలు చేసేందుకు ఆర్డర్లు ఇచ్చారు.

-హైమావతి, కాగజ్‌నగర్



పశ్చిమ బెంగాల్ దిష్టిబొమ్మ దహనం

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కోల్‌కత్తాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన హత్యాచారం కేసులో న్యాయం జరగకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం బస్టాండ్ ప్రాంతంలో పీవోడబ్ల్యూ, ఐఎఫ్‌టీయూ నాయకులు పశ్చిమ బెంగాల్, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ మాట్లాడుతూ ట్రైనీ డాక్టర్ పై జరిగిన అత్యాచార విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. అరుణ, మంగ, లక్ష్మీ, శ్రీనివాస్, మల్లన్న, రామన్న, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సకాలంలో సరుకులు పంపిణీ చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు సకాలంలో సరుకులు పంపిణీ చేయాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సరుకుల వివరాలు, నిల్వలు, ధరల వివరాలను, షాపు నెంబర్, మొబైల్ నెంబరు నోటీసు బోర్డులో ఉంచాలని సూచించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, మేనేజర్ శ్రీకళ,ఏఎస్‌వో వేణు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



నినాదాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య, నాయకులు

కాసిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు బుధవారం మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కాసిపేట, ముత్యంపల్లి పంచాయతీల నుంచి 62 మంది చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. చిన్నయ్య మాట్లాడుతూ అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి కాలం చెల్లిందన్నారు. రూ. 4 వేల పింఛన్ ఇస్తానని మాట తప్పారని, ఆరు గ్యారంటీలు అమలుకు నోచుకోలేదన్నారు. మాజీ సర్పంచు ఆడె బాదు, ఉపసర్పంచు బోయిని తిరుపతి యాదవ్, బీఆర్‌ఎస్‌మండల కన్వీనర్ రమణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

దీపావళికి కొత్త రెవెన్యూ చట్టం

- వేగంగా అడుగులు వేస్తున్న ప్రభుత్వం
- ఇప్పటికే అభిప్రాయాలు సేకరించిన సర్కారు
- మంత్రి మండలి ఆమోదించడమే తరువాయి
- త్వరలో రూపుదిద్దుకోనున్న కొత్త చట్టం



మంచిర్యాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ కొత్త చట్టం రూప కల్పనకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీపావళికి అమల్లోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఆగస్టులో ముసాయిదాను సిద్ధం చేసిన ప్రభుత్వం అన్ని వర్గాల నుంచి అభిప్రాయాలను సేకరించింది. వివిధ వర్గాల నుంచి సేకరించిన అభిప్రాయాలు, సూచనలు, చట్టానికి సంబంధించిన అంశాలు ఇప్పటికే ప్రభుత్వానికి అందాయి. గ్రామస్థాయిలో ప్రత్యేక రెవెన్యూ వ్యవస్థ ఉండాలని, సమస్యలపై అప్పిలేట్ అథారిటీ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో భూ కమిషన్ ఏర్పాటు చేయాలనే అభిప్రాయాలు వచ్చినట్లు సమాచారం. మొన్నటి వరకు ధరణి పోర్టల్ సృష్టించిన సమస్యలు అన్నీ ఇన్నీకావు. రైతుల ప్రమేయం లేకుండా రెవెన్యూ రికార్డుల్లో తప్పులు దొర్లడంతో సమస్య జఠిలమైంది. రెవెన్యూ సిబ్బంది చేసిన తప్పులకు లక్షలాది మంది రైతులు అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. పూర్వీకుల నాటి నుంచి పట్టాగా ఉన్న భూములను ప్రభుత్వానివంటూ నోటీసులు లేకుండానే నిషేధిత జాబి తాలో పెట్టి అష్టకష్టాలు పెడుతున్నారు. అధికారుల చుట్టూ తిరిగినా సమ స్య పరిష్కారానికి నోచుకోవడం లేదు.



'భూ మాత'గా నామకరణం

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ పేరును రేవంత్ సర్కారు 'భూ మాత'గా మార్పు చేసింది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న భూ రికార్డుల నిర్వహణ పద్ధతులను పరిశీలించిన అనంతరం వ్యవసాయ, వ్యవసాయేతర భూములకు సంబంధించి వేర్వేరు రికార్డులు చేయాలనే నిశ్చయానికి ప్రభుత్వం వచ్చింది. భూ రికార్డుల నిర్వహణకు మెరుగ్గా ఉండే విధంగా ముసాయిదా బిల్లుపై రైతు సంఘాలు, మేధావులు, విద్యావేత్తలు, న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు, విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకోనుంది. భూ సేకరణలు, వ్యవసాయ, వ్యవసాయేతర భూములను గుర్తించి మండల, డివిజన్ స్థాయిలో పరిష్కరించేలా మార్పులు తేవడంతోపాటు పట్టాదారు మృతి చెందిన పక్షంలో వారసత్వ భూముల బదలాయింపు ప్రక్రియ వేగవంతం చేయనున్నారు. గ్రామాల్లో ఆబాదీ భూముల రికార్డులను ఆధునీకరించడం, సాదా బైనామా, భూముల రిజిస్ట్రేషన్ రుసుం వసూలు చేయడం, ఈసీలో అనుభవదారుడి పేరిట కాలమ్ ప్రవేశపెట్టడం లాంటి మార్పులు చట్టంలో చోటు చేసుకోనున్నాయి. అప్పీల్ అథారిటీ ఆర్డీవోలకు అప్పగించేలా చర్యలు తీసుకోనున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల హక్కులకు నష్టం వాటిల్లకుండా చట్టాన్ని రూపొందించనున్నారు.

మిగతా 7వ పేజీలో...

భూసేకరణ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి

కలెక్టర్ కుమార్ దీపక్

జైపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మంచిర్యాల-వరంగల్-విజయవాడ వరకు తలపెట్టిన రహదారి నిర్మాణానికి జిల్లాలో భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. బుధవారం టేకుమట్ల, ఎల్కంటి, శెట్‌పల్లి, నర్సింగాపూర్, బెజ్జాల, కుందారం, రొమ్మిపూర్, కిష్టాపూర్,వేలాల గ్రామాల్లో పర్యటించి సర్వే తీరును తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మంచి ర్యాల-విజయవాడ జాతీయ రహదారి 334 కిలోమీటర్ల మేర ఉంటుందని జిల్లా పరిధిలో 110 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉండగా ఇప్పటికే 83 హెక్టార్ల భూమి ప్రభుత్వానికి అప్పగించామన్నారు. రహదారుల నిర్మాణం లో కోల్పోతున్న అటవీ శాఖ భూములకు ప్రత్యామ్నాయ భూములను గు ర్తించాలని, అటవీ శాఖ ద్వారా అవసరమైన అనుమతుల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రహదారి నిర్మాణంలో భాగం గా సేకరణ జరుగుతున్న భూముల సంబంధిత అంశాలపై అధికారులు భూ యాజమానులు రైతుల సమన్వయంతో త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీవో రాములు, తహసీల్దార్ వనజారెడ్డి, రైతులు పాల్గొన్నారు.



భూసేకరణ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

రిజిష్టర్లలో సేవల వివరాలు నమోదు చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆశా కార్యకర్తలు అందిస్తున్న ఆరోగ్య కార్యక్రమాల వివరాలను రిజిష్టర్‌లలో నమోదు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, వైద్యాధికారి కృపాబాయి, ప్రోగ్రాం అధికారి ఫయాజ్‌తో కలిసి ఆశా కార్యకర్తలకు రిజిష్టర్‌లను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 651 మంది ఆశా కార్యకర్తలు పనిచేస్తున్నారని, వీరికి 3,515 రిజిష్టర్‌లను అందించామని, రిజిష్టర్‌లలో17 రకాల వైద్య సేవల గురించి వివరంగా ఇవ్వడం జరిగిందన్నారు. వైద్యాధికారులు అనిల్, వెంకటేశ్వర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు అండగా...

- స్వయం ఉపాధి కోసం బ్యాంకుల ద్వారా రుణాలు
- రూ.5లక్షల నుంచి 1 5 లక్షల వరకు అందజేత
- ఐకేపీ, మెప్మా అధికారుల పర్యవేక్షణ
- సామాజిక సేవా కార్యక్రమాల్లో సైతం ముందంజ



సమావేశం నిర్వహిస్తున్న టీఎంసీ రఘురాం

7

గుంతలమయంగా కాగజ్‌నగర్ రోడ్లు

- ఏడాదికే లేచిపోయిన తారు
- గల్లీ రోడ్లు మరింత అధ్వాన్నం



లారీ చౌక్‌లో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

6

సమస్యలు పరిష్కరించాలి

జన్నారం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ బుధవారం తెలంగాణ చీఫ్ కన్జర్వేట్ ఆఫ్ ఫారెస్టు అధికారి డోబ్రియల్‌కు వినతి పత్రం అందించారు. టైగర్ జోన్ పరిధిలోని రహదారిపై భారీ వాహనాలను అనుమతించకపోవడంతో అభివృద్ధి జరగడం లేదన్నారు. భారీ వాహనాలను అనుమతి ఇవ్వడంతో పాటు టైగర్ జోన్ పరిధిలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే అడవిలోకి పశువులను మేతకు అనుమతించడం, లోకల్ వెహికల్స్‌కు పాస్ ఇప్పించడం, రోడ్డు వైండింగ్ చేపట్టాలని కోరారు. రాజశేఖర్, సయ్యద్ ఇసాక్ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు సమాజ సేవలో పాల్గొనాలి

- రక్తదానం ప్రాణాదానంతో సమానం
- రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్



మాట్లాడుతున్న సీపీ ఎం శ్రీనివాస్

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు సమాజ సేవల్లో పాల్గొనాలని, రక్తదానం ప్రాణదానంతో సమానమని రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అమరవీరులు రేపటి తరాల భవిష్యత్తు కోసం ప్రాణత్యాగాలు చేశారని, వారి త్యాగాలను వెలకట్ట లేమని కొనియాడారు. రక్తదానంపై అపోహలను వీడాలని, ఆరోగ్యంగా ఉన్న ఎవరైనా సరే 6 నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. దాతలకు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. డీసీపీ ఎ.భాస్కర్, ఏసీపీ ఆర్. ప్రకాష్, టౌన్, రూరల్ సీఐలు ప్రమోద్‌రావు, అశోక్ కుమార్, సీఐలు నరేందర్, నరేష్ కుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ భాస్కర్ రెడ్డి, సెక్రటరి చందూరి మహేందర్, సబ్ డివిజన్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

దండేపల్లి: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీసుశాఖ నిర్వహించిన రక్తదాన శిబిరంలో బుధవారం మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ రక్తదానం చేశారు. ఆయనతో పాటు మండలానికి చెందిన యువత రక్తదానం చేశారు. డీసీపీ ఎగ్గిడి భాస్కర్, ఏసీపీ ప్రకాష్ చేతుల మీదుగా సర్టిఫికేట్ అందుకున్నారు.

హాజీపూర్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం గుడిపేట 13వ బెటాలియన్‌లో మంచిర్యాల వాలంటరీ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కమాండెంట్ వెంకటరాములు మాట్లాడుతూ అన్నిదానాల్లోకెల్లా రక్తదానం గొప్పదని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలన్నారు. అసిస్టెంట్ కమాండెంట్ కాళిదాసు, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



నందులపల్లిలో బిందెలో నీళ్లతో మహిళలు

వరుణ దేవా.. కరుణించు

నెన్నెల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వర్షం కురువాలని నందులపల్లిలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం బిందెల్లో నీళ్లతో ఊరేగింపుగా వెళ్ళి సల్లమల్లన్న గుడిలో జలాభిషేకం చేశారు. 20 రోజులుగా వర్షం లేక పోవడంతో పత్తి, వరి పంటలు ఎండి పోతున్నాయని తెలిపారు. చివరి తడితో పంట దిగుబడులు చేతికి వస్తాయని, వర్షం మొహం చాటేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజులుగా గ్రామ దేవతలకు పూజలు చేస్తున్నట్టు మహిళలు పేర్కొన్నారు.

లెదర్ పార్కును ప్రారంభించాలి

మందమర్రిరూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి మండలంలోని లెదర్ పార్కుకు నిధులను కేటాయించి ప్రారంభించాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పెరుమాళ్ల రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం పాలవాగు సమీపంలోని లెదర్ పార్కును పరిశీలించారు. మాదిగలకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం వెంటనే లెదర్ పార్కుకు నిధులు కేటాయించి ఉత్పత్తిని ప్రారంభించాలని కోరారు. రేగుంట సునీల్ మాదిగ, జనార్దన్ మాదిగ, రమేష్ మాదిగ, శ్రీనివాస్, విజయ్‌కుమార్, రాజం, కొమురయ్య, పురుషోత్తం, శంకర్, దేవన్న, కుమారస్వామి, పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

నస్పూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవుల కేటాయింపుల్లో మాదిగలకు ప్రాధా న్యం ఇవ్వాలని మాదిగ హక్కుల దండోరా (ఎంఎస్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునిల్ మాదిగ అన్నారు. ప్రెస్ క్లబ్‌లో ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పెరుమాళ్ళ రామకృష్ణతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చెవెళ్ళ డిక్లరేషన్ హామీలను నెరవేర్చాలన్నారు. మాదిగలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచారన్నారు. లెదర్ పార్కులకు నిధులు కేటాయించాలని, డిసెంబరులోగా కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలన్నా రు. ఎల్కంటి జనార్దన్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు కడారి రమేష్ మాదిగ, నాయకులు వడ్లకొండ సంజీవ్, అటకపురం సమ్మయ్య, కొప్పర్తి రాజం, పురుషోత్తం, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

లక్షెట్టిపేటరూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుపై బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు అను చిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఆర్టీపీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షు డు గడ్డం త్రిమూర్తి పేర్కొన్నారు. బుధవారం విశ్రాంతి భవనం ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావులు ఇద్దరు ఎమ్మెల్యేపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని ఇది సరైంది కాదన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు పూర్ణచందర్‌రావు, పట్టణాధ్యక్షుడు ఎండీ ఆరీఫ్, మండల అధ్యక్షుడు పింగళి రమేష్, నాగభూషణం పాల్గొన్నారు.

రఘునాథ్‌పై ఆరోపణలు సరికాదు

దండేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌పై కాంగ్రెస్ పార్టీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేయడం సిగ్గుచేటని పార్టీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య అన్నారు. పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రఘునాథ్ ప్రజలకు అందుబాటు ఉంటు ఎన్నో సేవ కార్యక్రమాలు చేస్తూ ప్రజా సేవకే అంకితమయ్యారన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని ఆయన డిమాండ్‌చేశారు. పల్లె రాకేష్, శ్రీనివాస్, అక్కల దివ్య, కిషన్, రవిగౌడ్, రాకేష్, పాల్గొన్నారు.